క్లుప్తంగా

మంత్రులకు శుభాకాంక్షల వెల్లువ



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్: నూతనంగా ఎన్నికైన రాష్ట్ర మంత్రులను గురువారం షాద్‌నగర్ కాంగ్రెస్ నేత రాయకంటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సచివాలయానికి వెళ్లి డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ



పనులు ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి, గోవిందమ్మ

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని లక్ష్మారెడ్డిగూడ గ్రామంలో అండర్‌డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు




జిల్లెలగూడలోని వేంకటేశ్వర స్వామి ఆలయం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడలోని పురాతన మత్స్యావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు మార్గశిరమాస ధనుర్మాస ఉత్సవాలు జరుపుతున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలతో పాటు 23వ తేదీన వైకుంఠ ఏకాదశి, జనవరి 11న కూడార్ మహోత్సవం, 14వ తేదీన శ్రీ గోదా రంగనాధుల కల్యాణోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఉత్సవాలకు నగరం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్ రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఉష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కొనసాగుతుందని వివరించారు. ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను 9959226287 ఫోన్‌నంబర్ ద్వారా విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

సబితారెడ్డికి వినతి



సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

బడంగ్‌పేట్: ఎమ్మెల్యే సబితారెడ్డికి భూ బాధితులు వినతిపత్రం ఇచ్చారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని సర్వే నంబర్ 2లోని భూ బాధితులు గురువారం ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూమిని చిత్రం వంశానికి చెందిన బాధితులకు అందేలా న్యాయం చేయాలని విన్నవించారు. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సబితారెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుడ్ల శ్రీనివాస్, రమేశ్, పోచమ్మ, ఎలమ్మ, దేవయ్య, ముత్యాలు, యాదయ్య, సుధాకర్, శ్రీనివాస్, మహేందర్ తదితరులున్నారు.

లక్ష్యం నెరవేరేనా ?

- నకల సదుపాయాలతో కార్యాలయం నిర్మాణం
- పాలనకు శ్రీకారం
- కొత్త ఎమ్మెల్యేపై కోటి ఆశలు
- నియోజక వర్గ అభివృద్ధిని కాంక్షిస్తున్న జనం



ఎమ్మెల్యే కార్యాలయంలో పూజలు చేస్తున్న వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నియోజకవర్గానికి సచివాలయం లాంటింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలైనా, పార్టీ కార్యక్రమాలైనా మొదలు పెట్టేది ఇక్కడి నుంచే. నియోజకవర్గ అభివృద్ధిని జనం కాంక్షిస్తున్నారు. ఇటీవల ఎన్నికైన కొత్త ఎమ్మెల్యేపై కోటి ఆశలతో జనం ఉన్నారు. నియోజకవర్గంలో సకల సదుపాయాలతో ఎమ్మెల్యే కార్యాలయం నిర్మాణం జరిగింది.

అన్ని సదుపాయాలతో..

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. జీ ప్లస్ 1తో నిర్మించిన భవనంలో అన్ని సదుపాయాలు కల్పించారు. కుటుంబ సభ్యులతో నివాసం ఉండేందుకు అవసరమైన పడక గదులు, వంట గది, హాల్, గ్రౌండ్‌ఫ్లోర్‌లో అధికారులతో సమీక్షలు నిర్వహించేందుకు, ప్రజలను కలిసేందుకు అవసరమైన పెద్ద హాల్, రెండు పడక గదులతో పాటు ప్రహరీ నిర్మించారు. ఈ క్యాంపు కార్యాలయం నుంచి నిర్దేశిత లక్ష్యాలు నెరవేరాలని ప్రజలు కోరుతున్నారు.

2014లో నిర్మాణానికి శ్రీకారం..

2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యేల కోసం క్యాంపు కార్యాలయాలను నిర్మించారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ప్రణాళిక నిధుల నుంచి కోటి రూపాయలతో నిర్మించారు. 2023, మే 30న గత ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ భవనాన్ని ప్రారంభించి ఎన్నికల వరకు అక్కడి నుంచి పాలన కొనసాగించారు.

పాలనపై ప్రత్యేక దృష్టి..

వివిధ శాఖల అధికారులతో గత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. లబ్ధిదారులకు ఇక్కడి నుంచి ప్రభుత్వ పథకాలను అందజేశారు. శాఖల పరంగా సమీక్షలు నిర్వహించి సమస్యలను పరిష్కారానికి చొరవ చూపారు. సీఎం సహాయ నిధి కోసం ధరఖాస్తు చేసుకునే వారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేపై ప్రజలు కోటి ఆశలు పెంచుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఎదురుచూస్తున్నారు. పాలనలో తనదైన ముద్రవేస్తారని ఆశిస్తున్నారు. అయితే నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి పాలనపై ప్రత్యేక దృష్టి సారించారు.

> **స్వార్థం లేకుండా పాలన కొనసాగిస్తా..**
>
> 
>
> పాలనలో నూతన సాంప్రదాయాలకు శ్రీకారం చుడతాను. ప్రజలు ఎలాంటి లక్ష్య సాధనకు తనను గెలిపించారో వారి ఆలోచనలకు అనుగుణంగా పని చేస్తా. ఎలాంటి స్వార్థం లేకుండా పాలన కొనసాగిస్తాను. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను.
>
> – వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

అమెజాన్ కృషి అభినందనీయం

ఎంపీడీఓ అనురాధ

షాబాద్: మోడల్ స్కూల్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి అమెజాన్ వెబ్ సిరీస్ సంస్థ కృషి అభినందనీయమని ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. అమెజాన్ వెబ్ సిరీస్ సంస్థ ఇన్‌కమ్యూనిటీస్ ప్రోగ్రాంలో భాగంగా షాబాద్‌లోని మోడల్ స్కూల్ పునరుద్ధరణ, సుందరీకరణ పనులు చేపట్టింది. ఆ పనులు పూర్తికావడంతో తెలంగాణ మోడల్ స్కూల్ అదనపు డైరెక్టర్ రమణకుమార్, జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు ఆదేశాలతో గురువారం ఎంపీడీఓ అనురాధ, ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీపర్సన్‌తో కలిసి మోడల్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమెజాన్ వంటి సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో విద్యపై నూతనోత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. పాఠశాల సుందరీకరణ, గోడలపై వేసిన బొమ్మలు విద్యార్థుల్లో సైన్స్, టెక్నాలజీ, కళలు, గణిత శాస్త్రాలపై ఆసక్తి పెంచుతాయన్నారు. ఈ సంస్థ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, ఆసుపత్రుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అమెజాన్ వెబ్ సిరీస్ సంస్థ, సెర్ప్ సంస్థతో కలిసి 50 పామ్‌ఫాండ్‌ల అభివృద్ధి చేపడుతున్నామని సంస్థ ప్రతినిధి కెర్రీపర్సన్ తెలిపారు. ఎంఈఓ శంకర్‌రాథోడ్, ప్రిన్సిపాల్ శ్రీవాచ్ఛ, పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకుడు రామస్వామి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి

చేవెళ్ల: ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని ఉంటున్నా ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె రామస్వామి డిమాండ్ చేశారు. చేవెళ్ల మండలకేంద్రంలో గురువారం గుడిసెలు వేసుకున్న చోట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అక్కడే సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేందరలో సర్వే నెంబర్ 75 లోని ప్రభుత్వ భూమిలో పేదలు గత పది నెలలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. వారికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్నామన్నారు. కొత్తగా ఏర్పాడిన ప్రభుత్వం పేదలను గుర్తించి వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి ఇక్కడ కనీస సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఐ వారికి అండగా నిలబడుతుందన్నారు. ఈ నెల 26నుంచి సీపీ ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉంటాయని, ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో నాయకులు కార్యకర్త లు ఈ వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ, అనుబంధ సంఘాల నా యకులు సుధాకర్ గౌడ్, సత్యనారాయణ, సత్తిరెడ్డి, మక్బుల్, అంజయ్య, మంజుల, అమృత, విజయమ్మ, అనసూయ, అంజిరెడ్డి, మల్లారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ



షాద్‌నగర్: పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు



మొయినాబాద్: పడిపూజలో స్వాములు

షాద్‌నగర్: పట్టణంలోని ఎల్ఎస్ కాలనీలో శ్రీ శివ మారుతీ గీతా అయ్యప్ప మందిరంలో గురువారం పట్టణానికి చెందిన ఫార్టీ వ్యాపారి పాతూరి వెంకట్‌రావు స్వాములకు అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోలెపు చంద్రశేఖర్, బసప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, మంజు శ్రీ రాఘవేందర్, రేటికల్ నందీశ్వర్, భద్రప్ప, గూదె సత్యనారాయణ, పిన బాక ప్రభాకర్, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, సతీశ్, సత్యనారాయణ, సాంబశివరావు, నక్కల వెంకటేశ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: ముస్తాఫా కాలనీలో కన్నెస్వామి రంజిత్‌రెడ్డి ఏర్పాటు చేసిన మహా పడిపూజ ఘనంగా జరిగింది. గురుస్వామి సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో చేశారు. ఈ సందర్భంగా పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు మల్లారెడ్డి, నాగేశ్, రమేశ్, నరేశ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదల ఉంటే విజయం సాధ్యం

డాక్టర్ సజ్జల జగదీశ్వర్



పాఠశాల వ్యవస్థాపకులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల్లో ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటేనే విజయం సాధ్యమని డాక్టర్ సజ్జలజగదీశ్వర్ అన్నారు. గురువారం కిషన్‌నగర్ శివారులోని ఇండియన్ హైట్స్ పాఠశాల వ్యవస్థాపకుడు సజ్జల దాక్షాయనీ, సజ్జలభువనేశ్వర్ ఆధ్వర్యంలో పాఠశాల వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సజ్జలజగదీశ్వర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వినయంతో కూడిన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. నేటి బాలలే భావి భారత పౌరులని, ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. చిన్నారులు బ్రహ్మముహూర్తంలో నిద్రలేచి స్థితప్రజ్ఞులు కావాలని సజ్జల భువనేశ్వర్ పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, డైరెక్టర్లు మహేశ్వర్, విశ్వేశ్వర్, పాల్గొన్నారు.

ఎయిర్‌వాల్వ్ చుట్టూ మురుగు



మిషన్‌భగీరథ పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్ చుట్టూ చేరిన మురుగు

- ఆందోళనలో జనం
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు ఏర్పాటు చేసిన ఎయిర్‌వాల్వ్ చుట్టూ మురుగు చేరి దుర్వాసన వెదజల్లుతుంది. మొయినాబాద్ మండల కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్క నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ వేశారు. దా నికి ఏర్పాటు చేసిన ఎయిర్‌వాల్ నుంచి నీరు లీకై మురుగు కుంటగా తయారైంది. దీంతో పాటు అక్క డ చుట్టు ప్రక్కల నీరు కూడా ఆ గుంటలో చేరుతుందని స్థానికులు చెబుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు సరఫరా చేసినప్పుడు ఆ మురుగు ఎయిర్‌వాల్ నుంచి పైప్‌లోకి వెళ్తుందని కొందరు చెబుతున్నారు. మొయినాబాద్ మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాలకు ఈ పైప్‌లైన్ నుంచే నీటి సరఫరా అవు తున్నాయని స్థానికులు తెలిపారు. సరఫరా అయిన ఈ నీటిని తాగితే రోగాల బారిన పడే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగును శుభ్రం చేయించి స్వచ్ఛమైన నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణం




మన్నాన్‌పల్లి- ఘట్టుపల్లి బీటీ రోడ్డు

- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, స్థానికులు

మహేశ్వరం: మన్నాన్‌పల్లి-కోళ్లపడకల్ రోడ్డు వయా ఘట్టుపల్లి బీటీ డబుల్ రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నుంచి సుమారు రూ.15.20 కోట్ల నిధులు తీసుకొచ్చి శంకుస్థాపన చేశారు. మన్నాన్‌పల్లి, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, కోళ్లపడకల్ పీడబ్ల్యూ రోడ్డు వరకు రోడ్డు వెడల్పు కోసం స్థానిక ప్రజా ప్రతినిధులు రోడ్డు విస్తరణ కోసం భూములిచ్చేందుకు రైతులను ఒప్పించారు. రోడ్డు మధ్యలో వర్షం నీరు వెళ్లడానికి కల్వర్టులను కూడా నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంతో పొరండ్ల, కోళ్లపడకల్, ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి, ఘట్టుపల్లి తండా, మన్నాన్‌పల్లి గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. రోడ్డు నిర్మాణంతో ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, కోళ్లపడకల్ గ్రామాల సర్పంచ్‌లు కొరుపోలు ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, నారాయణరెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్పీకర్‌కు అభినందనల వెల్లువ



తలకొండపల్లి: నూతన అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ఏకగ్రీవంగా అసెంబ్లీ సభాపతిగా ఎన్నికైన ప్రసాద్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శాసనసభ వ్యవస్థలో ఉన్నతస్థానానికి ఎదిగిన ప్రసాద్‌కుమార్ ఆ స్థానానికి మరింత గౌరవం వచ్చేలా సభను నిర్వహిస్తారని ప్రభాకర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న దశరథ్ నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన క్యాతీక మధుకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.38 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితుడికి చెక్కును జెడ్పీటీసీ దశరథ్ నాయక్ అందజేశారు. సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, ఉప సర్పంచ్ పాండు, నాయకులు మహేశ్, పాండు, కిషన్, శ్రీకాంత్, రాజు ఉన్నారు.

బీమాతో.. ధీమా

- వంట గ్యాస్‌కూ క్లెయిమ్
- సిలిండర్ పేలితే రూ.40లక్షల వరకు పరిహారం

షాబాద్: ప్రస్తుత కాలంలో వంట గ్యాస్ లేని కుటుంబం లేదు. ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారింది. ఒక్కోసారి గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అజాగ్రత్తల వల్ల పేలుళ్లు సంభవిస్తున్నాయి. అయితే దీనికి సంబంధించి ఆయా ఎల్పీజీ సంస్థలు అందిస్తున్న బీమా సదుపాయం వినియోగదారులకు ధీమా కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో వంట గ్యాస్ వల్ల ప్రమాదం సంభవిస్తే బీమా క్లెయిమ్ ఎలా చేసుకోవాలి? నిబంధనలు ఏమిటీ? తదితర వివరాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్..

ఎల్పీజీ వినియోగదారులకు పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ కింద బీమా సౌకర్యం కల్పిస్తున్నాయి. ఆయా కంపెనీల్లో నమోదైన ప్రతి ఖాతాదారుడికీ ఇది వర్తిస్తుంది. ఈ పాలసీలో థర్డ్ పార్టీ బీమా కూడా మిళితమై ఉంటుంది.

పరిహారం పొందాలంటే..

వంట గ్యాస్ సిలిండర్ పేలితే వెంటనే సంబంధిత కంపెనీ డిస్ట్రిబ్యూటర్ లేదా డీలర్‌కు విషయం తెలియజేయాలి. అతడు ఆ కంపెనీ సేల్స్ అధికారికి సమాచారం ఇస్తారు. ఈ క్రమంలో సేల్స్ అధికారి, స్థానిక తహశీల్దార్, ఇన్సూరెన్స్ సర్వేయర్, అగ్నిమాపక శాఖ అధికారి వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించి చుట్టుపక్కల వారిని విచారిస్తారు. అనంతరం ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేస్తారు. గ్యాస్ సిలిండర్ ఎక్కడ బుక్ చేసుకుంటారో ఆ డీలర్ నుంచే ఇన్సూరెన్స్ కూడా క్లెయిమ్ అవుతుంది.

మృతులకు పరిహారం ఇలా...

గ్యాస్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందితే సుమారు రూ.6లక్షలు, గాయాలైతే రూ.25వేల నుంచి రూ.2లక్షల వరకు ప్రమాదం జరిగిన సమయంలో గృహోపకరణాలు, ప్రమాదం చోటు చేసుకున్న విధానం, ఇంటికి నష్టం జరిగితే సర్వేయర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రూ.2లక్షల వరకు పరిహారం చెల్లిస్తారు. అలాగే, వినియోగదారుడి ఇంట్లో గ్యాస్ లీక్ వల్ల చుట్టు పక్కల ఉండే నివాసాల్లో ప్రమాదం జరిగితే ఆ ప్రమాదానికి సంబంధించి మొత్తం కలిపి రూ.40 లక్షల బీమా వర్తిస్తుంది.



డిస్ట్రిబ్యూటర్‌కు సమాచారం..

సిలిండర్ పేలితే డిస్ట్రిబ్యూటర్‌కు వెంటనే సమాచారం అందించి, కంపెనీ పుస్తకం, బుక్ చేసుకున్న రశీదు, ప్రమాదం జరిగిన ఇంటి నంబర్, పరిహారం కోరుతూ అర్జీతో పాటు డిస్ట్రిబ్యూటర్ వద్ద ఉండే బీమా క్లెయిమ్ దరఖాస్తును పూర్తి చేసి అందజేయాలి. వంట గ్యాస్ ప్రమాదం, ఇన్సూరెన్స్ గురించి పౌరసరఫరాల శాఖకు ఎలాంటి సంబంధం ఉండదు.

గ్యాస్ ఏజెన్సీలు ఏం చేయాలి..

గ్యాస్ ప్రమాద బీమాపై సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కల్పించాలి. బీమాపై విస్తృత ప్రచారం చేపట్టాలి. వినియోగదారుల సేవలు, ప్రమాదాలు, పరిహారంపై సంస్థలు ఇచ్చే భరోసాపై చైతన్యం కలిగించాలి. ఏజెన్సీ ప్రతినిధులు రెండేళ్లకోసారి వినియోగదారులు వాడుతున్న గ్యాస్ పొయ్యిలు, సిలిండర్, రెగ్యులేటర్లను పరిశీలించాలి.

వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఇళ్లు, హోటళ్లు, వసతి గృహాల్లో వంట గ్యాస్ వినియోగదారులు ప్రతి మూడు, ఆరు నెలల కోసారి గ్యాస్ పొయ్యిలను ఏజెన్సీ నియమించిన మెకానిక్‌లతో పరిశీలింపజేయాలి. రెగ్యులేటర్‌కు, ప్యాయికి అనుసంధానం చేసేందుకు నాణమైన పైపునే వాడాలి. సిలిండర్‌కు దగ్గరలో మండే వస్తువులు ఉంచకూడదు. వంట గదిలోకి తగినంత గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి. సిలిండర్‌ను సులువుగా బయటకు తెచ్చేందుకు అవకాశం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. సిలిండర్ ఎప్పుడు నిలువుగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లో అడ్డంగా ఉంచరాదు. సిలిండర్ కంటే పొయ్యిని ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి. గ్యాస్ లీకైనప్పుడు బరువైన మిథెన్ వాయువు భూమిని చేరి తర్వాత పైకి వస్తుంది. గ్యాస్ లీకైనట్లు అనుమానం వస్తే విద్యుత్ పరికరాలు, స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయొద్దు. రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసి మూత పెట్టాలి.

కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు..

- మరణాలు చోటు చేసుకుంటే మరణ ధ్రువీకరణ పత్రం, పోస్టుమార్టం రిపోర్ట్, అగ్నిమాపక అధికారి నివేదిక, ప్రమాదం జరిగినట్లు రిపోర్ట్ పత్రాలు ఒరిజినల్స్ జత పరచాలి.
- గాయపడిన సందర్భాల్లో వైద్యుడి ప్రిస్క్రిప్షన్, మందులు కొనుగోలు చేసినట్లు దుకాణం నుంచి పొందిన బిల్లులు, ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు వైద్యుడి ధ్రువీకరణ పత్రం, డిశ్చార్జి కార్డు జతచేయాలి.
- ఆస్తి నష్టానికి సంబంధించిన బీమా కంపెనీ సర్వేయర్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఉండాలి. లేని యెడల బీమా వర్తించదు.
- సిలిండర్ బుక్ చేసుకున్న ఇంటి నంబర్ కాకుండా మరో ఇంట్లో ప్రమాదం జరిగితే బీమా వర్తించదు.
- సిలిండర్ లీకైనప్పుడు మాత్రమే బీమా క్లెయిమ్ చేస్తారు. ప్రమాదానికి సంబంధించిన ప్రాంతం, వివరాలు, ఏడు రోజులలోపు సంబంధిత బీమా కంపెనీకి అందినప్పుడే ఈ బీమా క్లెయిమ్ అవుతుంది.
- ఉద్దేశపూర్వకంగా ప్రమాదం సంభవించిందని వినియోగదారుడిపై అనుమానం వచ్చి పోలీస్ విచారణ జరుగుతున్నట్టయితే బీమా వర్తించదు.